సీఎంను కలిసిన ఎమ్మెల్యే యాదయ్య

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరగా.. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

–షాబాద్, జూలై 30

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం

ప్రతిభాపురస్కారాలు పొందిన విద్యార్థినీవిద్యార్థులతో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

నవాబుపేట, జూలై 30 : చదువుకు మించిన వజ్రాయుధం మరొకటి లేదని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అక్షర చేయుత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 2023-2024 విద్యాసంవత్సరంలో టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే చదువుపై శ్రద్ధ పెట్టి.. ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ సమాజంలో చదువుకు మించిన వజ్రాయుధం మరొకటి లేదని పేర్కొన్నారు. మార్పు అనేది చదువుతోనే సాధ్యమవుతుందన్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాటను ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. అనంతరం చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాభివృద్ధికి కృషి చేస్తున్నదన్నారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు, పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం అక్షర చేయుత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ యాదవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తే ఎన్నో విజయాలు సాధిస్తారన్నారు. ఈ సందర్భంగా 18 మంది విద్యార్థినీవిద్యార్థులకు ప్రతిభాపురస్కారాలతోపాటు నగదు బహుమతిని కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నాగిరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి, మాధుసూదన్‌రెడ్డి, టీచర్లు , విద్యార్థులు పాల్గొన్నారు.

భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలి

- రంగారెడ్డి కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేసిన ఫార్మాసిటీ ఏర్పాటు కోసం భూములిచ్చిన అన్నదాతలు

రంగారెడ్డి కలెక్టర్ శశాంకకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతులు

యాచారం, జూలై 30 : ఫార్మాసిటీ ఏర్పాటు కోసం భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంకకు పలువురు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసిన వారు ఫార్మాసిటీ ఏర్పాటు కోసం భూములిచ్చిన రైతులకు ఎకరానికి 121 గజాల ప్లాట్‌ను కేటాయిస్తూ గత ప్రభుత్వం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ఇచ్చిందని.. వెంటనే రైతులకు ఆ స్థలాలను కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఫార్మాసిటీ ప్లాట్ల సర్టిఫికెట్లు ఇచ్చి స్థలాలను కేటాయించే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటినా ఫార్మాసిటీ ప్లాట్ల గురించి పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మిర్ఖాన్‌పేట సమీపంలోని బల్జగూడ వద్ద 600 ఎకరాల్లో హెచ్ఎండీఏ లేఅవుట్ వేశారని.. భూమి చదునుతోపాటు రోడ్లు, ప్లాట్ల నంబర్లు వేయడం పూర్తైనా రైతులకు ప్లాట్ల కేటాయింపు మాత్రం జరుగడంలేదన్నారు. స్పందించిన కలెక్టర్ త్వరలోనే లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో కురుమిద్ద మంగలిగడ్డ తండా, మర్లకుంట తండా, పోతుగడ్డ తండా లకు చెంది న, లబ్ధిదారులు, రైతులు పాల్గొన్నా రు.

అర్హులందరికీ రుణ మాఫీ జరిగేలా చర్యలు

షాబాద్, జూలై 30: అర్హులందరికీ రుణ మాఫీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు షాబాద్ మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో మండలంలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన రైతు మాణిక్యంకు రూ. 1.40లక్షల రుణమాఫీ చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.

బీసీ డిక్లరేషన్ హామీలను నెరవేర్చాలి

- రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన

నిరసనలో పాల్గొన్న పలువురు నాయకులు

రంగారెడ్డి, జూలై 30 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో బీసీలకు జరిగిన అన్యాయంపై, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న మాటను విస్మరించడంపై నేతలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ శశాంకకు వినతిపత్రాన్ని సమర్పించారు. నిరసనలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు అంజన్‌కుమార్‌గౌడ్, బాలయ్య, సెన్సార్ బోర్డు సభ్యుడు ప్రతాప్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్‌యాదవ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మండల యువకులకు తప్పిన ప్రమాదం

దోమ, జూలై 30 : మండలంలోని దాదాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కృష్ణ, గురుచరణ్‌గౌడ్, ఈశ్వర్‌సిద్ధి, రమేశ్ తదితరులు శ్రీశైలం పుణ్యక్షేత్ర దర్శనానికెళ్లారు. మంగళవారం ఉదయం వారు కృష్ణానది డ్యాం వెనుక భాగంలో పుణ్యస్నానాలు ఆచరిస్తుండగా హఠాత్తుగా నాల్గో గేటు తెరువగా.. ఒక్కసారిగా వరద ఉధృతి పెరుగడంతో వారు అప్రమత్తమై నదిలోంచి సురక్షితంగా బయటికి వచ్చారు. అదే క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ కారు నది నీటిలో ఇరుక్కుపోవడంతో దాదాపూర్ గ్రామానికి చెందిన యువకులు ఆ కారును నీటి నుంచి సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. ఆ కారును నీటి నుంచి బయటికి తీసుకొస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పలువులు వారి సాహసాన్ని ప్రశంసించారు.

సంబురంగా సీత్లా పండుగ

మండలంలోని శంకర్‌కొండతండాలో మంగళవారం సాయంత్రం గిరిజనులు సీత్లా వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ప్రతి ఏటా వారు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుంటారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆ తండాలో పండుగ వాతావరణం నెలకొన్నది. గిరిజన మహిళలు తమ నెత్తిన నైవేద్యాన్ని పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి అమ్మవారి సమర్పించి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, పిల్లాపాపలు ఆరోగ్యంగా ఉండాలని సీత్లా మాతను వేడుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన యువతీయువకులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు మండ్లీ రాములు, శ్రీను, పత్యానాయక్, జాను, నరేశ్, పత్యానాయక్, సికిందర్, శ్రీను, సందీప్, లచ్చు, బాలు, విజయ్‌రాథోడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

–ఆమనగల్లు, జూలై 30

జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే కృషి

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

కార్యక్రమంలో మాట్లాడుతున్న టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

మాదాపూర్, జూలై 30 : జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా టీయూడబ్ల్యూజే పని చేస్తున్నదని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అన్నారు. మియాపూర్‌లోని హోటల్ అశోక గ్రాండ్‌లో మంగళవారం యూనియన్ రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన రాష్ట్ర కమిటీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో విలేకరుల సమస్యలపై తరచూ సమావేశాలు, చర్చలు జరుపుతున్నామన్నారు. సకాలంలో వైద్య సదుపాయాలు అందక పలువురు జర్నలిస్టులు ప్రాణాలను కోల్పోయారన్నారు. ప్రభుత్వం జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ త్వరలోనే హెల్త్ కార్డులను అందిస్తున్నదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి విలేకరికి అక్రిడిటేషన్ అందాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికి మండల జిల్లా కేంద్రాలుగా పరిగణనలోకి తీసుకుంటూ ఇండ్ల స్థలాలను మంజూరు చేసే విధంగా యూనియన్ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం, కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, జాతీయ కౌన్సిల్ మెంబర్ సలీంలు మాట్లాడారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీలో రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చేల్ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులను శేరిలింగంపల్లి యూనియన్ జర్నలిస్టులు సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన విరాహత్ అలీ, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డితో పాటు కోశాధికారి వెంకట్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, శంకర్ శిగా బాలరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కిషన్, సత్యనారాయణ, శేరి లింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస రావు, నాగేందర్ రెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు గౌడ్, కార్యవర్గ సభ్యులు దారుగుపల్లి సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టులు కొండా విజయ్ కుమార్ ఉన్నారు.

'నిలోఫర్'కు రెటినో స్కాన్ పరికరం వితరణ

తెలుగు యూనివర్సిటీ, జూలై 30: నిలోఫర్ దవాఖానలో చిన్న పిల్లల దృష్టిలోపాన్ని గుర్తించే అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వెల్‌షాలిన్ రెటినో స్కాన్ పరికరాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రైడ్ సభ్యులు హామీద్ సుల్తానా, ఫాతిమా మంగళవారం దవాఖాన ఆర్ఎంఓ డాక్టర్ జ్యోతి, కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ అర్చనకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అర్చన మాట్లాడుతూ, ఈ పరికరంతో నెలలు నిండకుండా తక్కువ బరువుతో పుట్టిన పిల్లల్లో కంటి సంబంధిత సమస్యలను కనుగొని సరైన సమయంలో వైద్యం అందించేందుకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ప్రధానంగా మూడేండ్ల లోపు చిన్నారుల కంటి సమస్యలను తెలుసుకునేందుకు ఈ పరికరం ఉపయోగపడుతుందని, ఇప్పటివరకు సరోజినీదేవి కంటి దవాఖానకు నిర్ధారణ కోసం పంపించే వాళ్ళమని ఇక నుంచి అటువంటి సమస్య ఉండదన్నారు. సుల్తాన్ బజార్ ప్రసూతి దవాఖాన, కింగ్ కోఠి దవాఖాన, జజ్గిఖానల నుంచి కూడా చిన్నారుల వైద్యం నిమిత్తం నిలోఫర్‌కు మెరుగైన వైద్య సేవలకు వస్తుంటారని తెలిపారు. ఇక నుంచి కంటి సమస్యలతో వచ్చే పిల్లలకు రెటినో స్కాన్ పరికరం సాయంతో సమస్యను గుర్తించి మెరుగైన వైద్యం అందించేందుకు అవకాశం ఉందన్నారు. రోటరీ క్లబ్ సభ్యులకు ఆర్ఎంఓ జ్యోతి కృతజ్ఞతలు తెలిపారు.

బీడీ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్ అవకాశం

సిటీబ్యూరో, జూలై 30(నమస్తే తెలంగాణ): బీడీ కార్మికుల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలను అందిస్తున్నదని హైదరాబాద్‌లోని బీడీ కార్మిక సంక్షేమ నిధి వైద్యశాల అధికారిణి డాక్టర్ స్వర్ణలత తెలిపారు. కేంద్ర కార్మిక శాఖ అందించే ఈ ప్రయోజనం కోసం ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఆగస్టు 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూ చించారు. ఇంటర్, డిగ్రీ, వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులు అక్టోబర్ 31లోపు scholarships.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్కాలర్‌షిప్ ప్రయోజనాలను పొందేలా ప్రతి ఒక్కరి బీడీ కార్మికుల పిల్లలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హెల్ప్ లైన్ నంబర్లకు 0120-6619540, 040-29561297 కాల్ చేసి డాక్టర్ స్వర్ణలత వివరించారు.

జీహెచ్ఎంసీలో అదనపు కమిషనర్ల బదిలీలు

సిటీబ్యూరో, జూలై 30(నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక శాఖలో జరుగుతున్న బదిలీల్లో జీహెచ్ఎంసీకి సంబంధించి పలువురు అదనపు కమిషనర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు పురపాలక ముఖ్య కార్యదర్శి దానకిశోర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న జె.సువార్త కరీంనగర్ అదనపు కమిషనర్‌గా బదిలీ అయ్యారు.
సంధ్య సిద్దిపేట మున్సిపాలిటీకి, వి.ప్రశాంతి సీడీఎంఏకు, డి.ధాకు నాయక్ పాల్వంచ మున్సిపాలిటీకి, ఏ.నాగమణి దమ్మాయిగూడ మున్సిపాలిటీకి, టి.దశరథ్ గద్వాల్‌కు, బి.రాజేశ్ కుమార్ బైంసాకు, ఏ.విజయలక్ష్మి వరంగల్ మెప్మాకు, సీహెచ్ జోత్స్న సీడీఎంఏకు బదిలీ అయ్యారు. నాగేందర్ చేర్యాల మున్సిపాలి టీకి, ఆర్.పుష్పలత నల్గొండ మున్సిపాలిటీకి, పి.శ్రీధర్, సీఎన్ రఘుప్రసాద్, ఎన్. సామాట్ర్ అశోక్‌కు జీహెచ్ఎంసీకి బదిలీపై వచ్చారు. సీహెచ్ రాజేందర్ రెడ్డి బదిలీపై గ్రేటర్‌కు వరంగల్‌కు, వెయింటింగ్‌లో ఉన్న అరుణకుమారి, డి.శంకర్ సింగ్ గద్వాల్ నుంచి జీహెచ్ఎంసీకి బదిలీపై వచ్చారు.

గ్రేటర్‌లో ఎక్కడా చెత్త కనిపించొద్దు

జోనల్ కమిషనర్లకు కమిషనర్ ఆమ్రపాలి ఆదేశం

సిటీబ్యూరో, జూలై 30(నమస్తే తెలంగాణ): గ్రేటర్ పరిధిలో ఎక్కడ కూడా చెత్త కనబడకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. కమిషనర్ అడిషనల్, జోనల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్‌ను మంగళవారం నిర్వహించారు. శానిటేషన్, స్వచ్ఛ ఆటో హాజరు శాతం మెరుగుపడే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. సహాయ వైద్యాధికారులతో పాటుగా సంబంధిత డిప్యూటీ కమిషనర్లు నిర్దేశించిన సమయంలో ఉదయం పూట తప్పని సరిగా విధులకు హాజరు కావాలని కమిషనర్ ఆదేశించారు. చెత్త, గ్రీన్ వెస్ట్ (సీ అండ్ డీ) భవన నిర్మాణ వ్యర్థాలు లేకుండా చూడాల్సిన బాధ్యత డీసీలు, సహాయ వైద్యాధికారులేనని కమిషనర్ పేర్కొన్నారు. జోనల్ కమిషనర్లు ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. సీఆర్ఎంపీ రోడ్లపైన పాట్ హోల్స్, రోడ్డు మరమ్మతులు, రోడ్డుపై మార్కింగ్ లైనింగ్, ఫుట్‌పాత్ మీడియంలో గ్యాప్ లేకుండా మొక్కలు నాటాలని కమిషనర్ ఆదేశించారు.

జీఐఎస్ సర్వేకు ప్రజలు సహకరించాలి: జీహెచ్ఎంసీ

సిటీబ్యూరో, జూలై 30 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ పరిధిలో ఆస్తులు, యుటిలిటీల జీఐఎస్ మ్యాపింగ్ సర్వేలో భాగంగా మంగళవారం క్షేత్రస్థాయిలో సర్వే మొదలైంది. అర్బన్ ప్లానింగ్‌లో భాగంగా ఇంటిగ్రేటెడ్ జీఐఎస్ సర్వేలో ఆస్తులు, భవనాలు, యుటిలిటీల వివరాలు కచ్చితంగా మ్యాపింగ్ చేయడం వల్ల భౌగోళికంగా గుర్తించడం, పన్నుల వసూలు కూడా సులభమవుతుంది. ఆస్తి పన్నుకు సంబంధించి సమస్యలను పరిష్కారంలోనూ ఇది ఉపకరిస్తుందని, ఆన్‌లైన్ చెల్లింపులు మరింత సులభతరం అవుతాయని అధికారులు తెలిపారు. హై రిజల్యూషన్ మ్యాపింగ్‌తో రోడ్లు, పార్కులతో పాటు ఇతరత్రా సదుపాయాల వివరాలు స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఉప్పల్, హయత్‌నగర్, హైదర్‌నగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, మియాపూర్, చందానగర్ ఏరియాల్లో ఈ ఫీల్డ్ సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. నగరంలోని మిగతా అన్ని ప్రాంతాల్లో సర్వేను కొనసాగిస్తామని తెలిపారు. వనరుల నిర్వహణ కోసం జీహెచ్ఎంసీ చేపట్టిన ఈ సర్వేకు ఇంటి యాజమానులు సహకరించాల్సిందిగా కోరారు. సర్వే సిబ్బంది కోరిన సమాచారాన్ని తెలియజేయాలని, సర్వే వివరాలు అత్యంత గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో సర్వేకు వచ్చే సిబ్బందికి భవన నిర్మాణ అనుమతి, అక్యుపెన్సీ సర్టిఫికెట్, లేటెస్ట్‌గా చెల్లించిన ఆస్తిపన్ను రసీదు, నల్లా బిల్లు, విద్యుత్ బిల్లు, యాజమాని ఐడీ వివరాలు, ట్రేడ్ లైసెన్స్ నంబర్ (కమర్షియల్ భవనాల) వివరాలు అందించి సహకరించాలని జీహెచ్ఎంసీ అధికారులు కోరారు. ఇంటింటికీ వెళ్లి భవన నిర్మాణాల ప్రక్రియ సర్వేను మరొకసారి డోన్ సర్వే ప్రకారంగా సరి చూసి నిర్ధారణ చేస్తారని అధికారులు పేర్కొన్నారు.

పాతబస్తీ మెట్రో పొడిగింపు

- 7.5 కి.మీతో కొత్త డీపీఆర్ రెడీ
- రూ.2300 కోట్ల వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా
- ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా మీదుగా చాంద్రాయణగుట్ట వరకు మెట్రో కారిడార్ నిర్మాణం

సిటీబ్యూరో, జూలై 30(నమస్తే తెలంగాణ): పాత నగరం మెట్రో అలైన్‌మెంట్ మారింది. మొదటి దశ మెట్రో రైలు ప్రాజెక్టులో జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ మీదుగా ఫలక్‌నుమా వరకు నిర్మించాల్సిన మెట్రో కారిడార్‌ను తాజాగా చాంద్రాయణగుట్ట వరకు పొడిగించారు. ఇప్పటి వరకు 5.5 కి.మీ మేర నిర్మించాల్సిన ఉన్న పాత నగరం మెట్రో మార్గాన్ని మరో 2 కి.మీ దూరం పొడిగిస్తూ కొత్త డీపీఆర్‌ను రూపొందించారు. మొత్తం 7.5 కి.మీ దూరంతో నిర్మించే పాత నగరం మెట్రో కారిడార్ నిర్మాణానికి రూ.2300 కోట్ల వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండో దశలో చేపట్టనున్న మెట్రో మార్గాల్లో పాత నగరం మెట్రో, నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు నిర్మించే మెట్రో మార్గాలకే అధిక ప్రాధాన్యతనిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ పాత నగరం మెట్రో కారిడార్‌కు రూ.500 కోట్లు, ఎయిర్‌పోర్టు మెట్రోకు రూ.100 కోట్లను కేటాయించారు. ఈ రెండు కారిడార్లు ఇన్నర్ రింగు రోడ్డుపై చాంద్రాయణగుట్ట వద్ద అనుసంధానం అవుతుండటంతో అక్కడ ఇంటర్‌ఛేంజ్ మెట్రో స్టేషన్‌ను నిర్మించేలా డీపీఆర్‌ను రూపొందించారు. చాలా ఏండ్లుగా పెండింగులో ఉన్న పాత నగరం మెట్రో మార్గాన్ని ఇతర కారిడార్లతో సంబంధం లేకుండా పూర్తి చేయాలని నిర్ణయించారు. దానికి అనుగుణంగానే ఎంజీబీఎస్ –చాంద్రాయణగుట్ట మెట్రో మార్గాన్ని కారిడార్–4గా నిర్ణయించి డీపీఆర్‌ను సిద్ధం చేశారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ అందజేసేందుకు సిద్ధంగా ఉంది.

ఆస్తుల సేకరణకే రూ.వెయ్యి కోట్లు...

పాత నగరంలో నిర్మించే 7.5 కి.మీ మెట్రో కారిడార్‌లో భారీ ఎత్తున ఆస్తులను సేకరించాల్సి వస్తోందని మెట్రో అధికారి తెలిపారు. ప్రతిపాదిత మెట్రో మార్గంలో సుమారు 1100లకు పైగా ఆస్తులు ఉన్నాయని, వాటన్నింటినీ గుర్తించి పరిహారాన్ని చెల్లించాలంటే మొత్తం ప్రాజెక్టు వ్యయంలో సగం ఆస్తుల సేకరణకే వెచ్చించాల్సి ఉంటుంది. ప్రస్తుతం పాత నగరంలో మెట్రో మార్గాన్ని నిర్మించే రోడ్డు విస్తీర్ణం చాలా తక్కువగా ఉండటంతో ఆ మార్గాన్ని 60 నుంచి 80 అడుగుల మేర విస్తరించాలంటే ఆస్తుల సేకరణ ఎక్కువ మొత్తంలో చేయాల్సి ఉంటుంది. అదే విధంగా ఈ మార్గంలో యుటిలిటీస్ (విద్యుత్ స్తంభాలు, మంచినీటి లైన్లు, డ్రైనేజీ లైన్స్, కేబుల్స్)ను మరో చోటుకు తరలించాల్సి ఉంటుంది. ఇందుకు సుమారు రూ.200 కోట్లు వ్యయం అవుతుందని మెట్రో అధికారి తెలిపారు. వీటికి తోడు మతపరమైన కట్టడాలు సైతం 100కు పైగా ఉండటంతో వీటికి ఎలాంటి ఆటంకం కలకుండా నిర్మాణాలు చేపట్టాల్సి ఉండటంతో చాలా సమయం తీసుకుంటుంది. అన్ని అడ్డంకులు దాటుకొని పాత నగరంలో మెట్రో మార్గాన్ని నిర్మించాలంటే సుమారు రెండు నుంచి మూడేండ్లు పడుతుందనే అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వంజరి కులస్తుల ఎస్టీ జాబితాలో చేర్చాలి

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 30: వంజరి కులస్తుల రిజర్వేషన్ల పునరుద్ధరణే లక్ష్యంగా వంజరి కుల జేఏసీ ఏర్పడింది. వంజరి కులస్తులకు ఎస్టీ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేసింది. తార్నాకలోని వంజరి భవన్‌లో 'వంజరి రిజర్వేషన్లు – భవిష్యత్తు కార్యాచరణ' అనే అంశంపై రాష్ట్రంలోని అన్ని రిజిస్టర్డ్ వంజరి సంఘాలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శంకరన్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా వంజరి కులస్తులను ఎస్టీ జాబితాలో చేరిస్తే వ్యక్తిగత కక్షలతో రాత్రికి రాత్రే ఒక చీకటి జీవో ద్వారా వంజరులను ఎస్టీ జాబితా నుంచి తొలగించి బీసీ 'డీ' జాబితాలో మర్రి చెన్నారెడ్డి చేర్చారని గుర్తు చేశారు. వంజరులపై చెన్నారెడ్డి మరణ శాసనం లిఖించారని ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నారెడ్డి ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేసి వంజర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి, తెలంగాణ వంజరి సంఘం మాజీ అధ్యక్షుడు కాలేరు విశ్వనాథం, వివిధ సంఘాల ప్రతినిధులు రవీందర్, లక్ష్మీనారాయణ, మహాదేవ్‌ముండే, కాలేరు రూపసురేశ్, ధాత్రిక ధర్మరాజు, ఎదుగాని హరినాథ్, పిట్టల అంజయ్య, ధాత్రిక కాశీనాథ్, కాలేరు యుగంధర్, అనంతుల అనిల్, కాలేరు శ్రీనివాస్, విఠల్, శ్రీనివాస రావు, భూమయ్య, సత్యం, శంకర్, రవీందర్, రత్నం, మహేశ్, ఆంజనేయులు, శ్రీనివాస్, రాజేందర్, బుచ్చిలింగం, లింగారెడ్డి పాల్గొన్నారు.